# నిజం నిజం!

ప్రొద్దున ఎనిమిదిగంటలైంది. మాఆవిడ ఇచ్చిన వెచ్చని కాఫీత్రాగుతూ గదిలోకూర్చుని ఆవిడతో మాట్లాడు తున్నాను. ఆవిడ ఏదో తమాషాఅయిన మాటలు చెపుతు న్నది వింటూ వింటూ చటుక్కున ఆమెబుగ్గపైచెయ్యివేశాను. ఆమె ఎవరయినా ఉన్నారేమోనని గిరుక్కున తిరిగి చూసే సరికి మాసీను వెనకాలనుంచుని ఉన్నాడు.

సీను చిన్నవాడే, అయినా ఆవిడ సిగ్గుపడి అక్కడ నుంచివెళ్ళిపోయింది. సీను ఎర్రటి నిక్కరు తొడుక్కు న్నాడు. తెల్లటి షర్టు నిక్కరులోకి దోపి పైన బెల్టుపెట్టి ఠీక్‌గా నుంచున్నాడు. వాడినిచూస్తే ముద్దొచ్చింది.

'ఏం కావాలెరా సీనూ?' అని అడిగాను.

'ఈ సెలవలు నాలుగురోజులూ ఇంటిదగ్గర ఉండి వస్తాను మామయ్యా' అన్నాడు.

'మళ్ళీ ఎందుకురా వెళ్ళటం?' అన్నాను. సీను దిక్కు ముఖంతో అక్కడే నుంచుని ఉన్నాడు.

'సీను అంటే ఎవరోకాదు. మా రంగయ్య కొడుకు. బంధుత్వం ఎల్లాగున్నా రంగయ్యా నేనూ చిన్నప్పటినుండీ స్నేహితులము. అందుకనే వాడు తన కుర్రవాణ్ని నాదగ్గర వదలిపెట్టి కాస్త కనిపెట్టి చూస్తూవుండరా అనిచెప్పివెళ్లాడు. కుర్రవాడు నాదగ్గరవుంటే వాడికోముక్క వస్తుందనీ, మంచి బుద్ధిమంతుడు అవుతాడనీ వాడి వుద్దేశం.

నేను నీనుకోసం పడుతున్న బాధ అయినా ఏమీలేదు కాకపోతే ఎప్పుడయినా వాడు ఇంటికి ఆలస్యంగా ప్రొద్దు పోయి వస్తేకోప్పడటం. వేళకు భోజనంచేస్తున్నదీ లేనిదీ కనుక్కోవటం. ఇవీ వాణ్ణి గురించి నాకుగల బాధ్యతలు.

మధ్యమధ్య వీడు ఏవోకుర్రతనపుచేష్టలుచేస్తుంటాడు. ఎంతజాగ్రత్తగా కనిపెట్టి చూస్తూఉన్నా! మొన్నదసరాసెలవలకు ఇంటికి వెళ్లాడు. వెళ్లినవాడు స్కూలు తెరవటంతోనే రాక నాలుగురోజులు ఆలస్యంగావచ్చాడు. ఎందుకురా ఇంత ఆలస్యంగా వచ్చావూ అని అడిగితే. 'నాన్న ఉండమన్నాడు మామయ్యా' అన్నాడు. సెలవుచీటి తెచ్చావురా అంటే తెచ్చాను గాని ఎక్కడో పారవేశానన్నాడు. నిజమో అబద్ధమో చెప్పలేను గానిమొత్తంమీద వాడేదో అబద్ధాలుఆడుతున్నాడని మాత్రం నాకు అనుమానం కలిగింది.

చదువువస్తేవస్తుంది లేకపోతేలేదు.కుర్రవాడిప్రవర్తన బాగుపడాలె. అదీనావుద్దేశం. అందుచేతనేఈచిన్నతనంలోనే నీనును కాస్త మంచిమార్గాన పెట్టాలనినేనుఆలోచిస్తున్నాను. ఈనాలుగురోజులూ ఇంటిదగ్గర ఉండివస్తానని నీను అడిగితే నేను వెంటనే ఒప్పుకొనక పోయిందీ అందుకనే!

'ఎందుకురా నీనూ, ఇప్పుడు నీవు మళ్ళీ ఇంటికి వెళ్ళటం? మొన్ననేకదా వెళ్ళివచ్చావు! ఇంతలోనే ఏమి తొందర? హాయిగా ఇక్కడేవుండి చక్కగా చదువుకో. పరీక్షలుకూడా దగ్గరకు వస్తున్నవి.' అన్నాను.

నీను బిక్కముఖంపెట్టి 'మానాన్న తప్పక రమ్మన్నాడు,' అన్నాడు.

నాకు ఏమిచెప్పాల్సిందితోచలేదు. 'సరేఅంతఅవసరం అయితే వెళ్లుదుగానిలే' అని అప్పటికి వాణ్ణి పంపివేశాను.

వాళ్ళ నాన్న నిజంగా రమ్మన్నాడేమో! పోవద్దని వాణ్ణి నిర్బంధించటం మంచిదిగాదు అనుకొని 'సరే పో'అని అందామనే అనుకొన్నాను.

తమాషాగా ఆరోజు సాయంత్రమే బజారులో హఠాత్తుగ మారంగయ్య కనపడ్డాడు. ఆయన ఏదో తొందర పని మీద బెజవాడ వెడుతున్నాడు. మేమిద్దరం కొంచెముసేపే మాట్లాడాము. పిల్లవాడి చదువు సంగతీ అదీ వచ్చింది. చదువు ఎల్లావున్నా కుర్రవాడు చెడ్డసహవాసాలుచేస్తున్నట్లు నాకు అనుమానంగా ఉందనికూడా చెప్పాను.

ఆయన నాచెయ్యి పట్టుకొని "కుర్రవాడిని బాగుచేసే బాధ్యతనీదిరా అబ్బాయి. మరినీఇంట్లో ఉంచింది ఎందుకూ! కాస్త మంచీ చెడ్డా చూస్తావని కాదూ! వాడిని ఒకదారిని పెట్టాలనీవు. పన్నెండేళ్ళ వెధవ. ఇప్పుడే నీవువాడినిసన్మార్గంలోకిదింపు. అంతా నీదే భారం' అంటూ బస్సుఎక్కాడు.

'అయితే చూడూ, స్కూలు మళ్ళీ నాలుగురోజులు మూస్తారు. ఈనాలుగు రోజులు ఇక్కడేఉండి చదువుకోరా అంటే, నాన్న రమన్నాడంటాడు. నిజంగా రమ్మన్నావా?'

'వత్తిది! దొంగ! నేను రమ్మనలేదు. రానక్కరలేదు. ఇక్కడేవుండి చదువుకోమను' అని చెప్పతూ ఉండంగానే కారుబయలుదేరి వెళ్ళిపోయింది.

ఒక్క విషయంమటుకు తేలిపోయింది. సీను అబద్ధం ఆడాడు. రేపు ఇంకాఎన్ని అయినా ఆడుతాడు! దాని తరు

వాత దొంగతనాలు నేర్చుకొంటాడు! ఇక ఆపైన స్కూలు ఎగగొట్టి ఎందుకు పనికిరాకుండా పాడయిపోతాడు. ఏదో కాస్త గట్టి ఏర్పాటు చెయ్యాలె. చెయ్యి చేసుకోవలసిన అవసరం ఉండదనుకొంటాను. సీనుఇంకా భయభక్తులలోనే ఉన్నాడు. ఈతభాకుగట్టిగాచీవాట్లువేస్తేచాలుననుకొన్నాను.

నేను ఇంటికి వెళ్ళటంతోనే 'ఒరే, సీనూ. మీ నాన్న కనపడ్డాడు, నిన్ను రమ్మనలేదుట! అబద్ధాలాడుతున్నావు! వెధవా!' అని కోప్పడలేదు ఏమి జరుగుతుందో, ఇంకాఏమంటాడో చూద్దామని ఊరుకొన్నాను.

మరునాడు సాయంత్రం మూడుగంటలకు సీనునాగది లోకివచ్చి పిల్లిలాగ నుంచున్నాడు. మాట్లాడటానికి వాడికి ధైర్యం లేకపోయింది. కాని వాడు ఎందుకు వచ్చిందీ దాకు తెలుసు. వాళ్ళఊరు వెళ్ళటానికి రెండురూపాయలు కావాలె వాడికి. నేనే మాట్లాడించాను.

'ఏంరా ?'

..........

'వెడతావా ?'

తల ఊపాడు.

'ఏం వెళ్ళకపోతే ?'

'మా నాన్న కోప్పడతాడు.'

"ఊఁహూ. పాపం మీనాన్న కోప్పడుతాడేం? నిన్ను గట్టిగా రమ్మని చెప్పాడా?"

"చెప్పాడు."

వెధవ! సులువుగా బ్రహ్మాండమైన అబద్ధం ఆడేశాడు.

నాకు చాలాకోపంవచ్చింది. రెండు బాదుదామా అనిపించింది. కాని అంత చిన్నవాడినికొడితే ఏమి ప్రయోజనం? వాడికి అబద్ధం ఆడటం తప్పు అని నచ్చచెప్పాలె.

అదీకాక ఇంకొకటితోచింది. వీడుఒక్కడూ ఎప్పుడూ ప్రయాణంచేయలేదు. అది కారణంగా చూపి ప్రస్తుతం వాడి ప్రయాణంఆపేద్దామనుకొని, అన్నాను 'ఒరే, నీవుఒక్కడివీ ఎల్లావెడతావురా! ఎప్పుడన్నా వెళ్ళావుగనుకనా?-ఎవ్వరన్నా మీఊరువాళ్లు వస్తే వాళ్ళతో పంపిస్తాను. అందాకా ఉండు.'

సీను ఒక్కనిమిషం కాస్తఆలోచిస్తున్నట్లు చూచి 'మా ఊరి కుర్రాడొకడు మాస్కూలులో ఉన్నాడు. వాడుకూడా వెళ్ళుతున్నాడు. మేమిద్దరం కలిసి వెడతాము మామయ్యా' అన్నాడు.

'వాళ్ళ స్కూల్‌కు సెలవలుఇవ్వటంలేదే!' అన్నాను.

'వాళ్ళ మాస్టరును సెలవు అడిగి వస్తున్నాడు.'

'వాడి పేరు?'

'సీతయ్య.'

'ఏ క్లాసు?'

'ఫోర్తుఫారం.'

సరేవెళ్లు. రేపుప్రొద్దున తొమ్మిదిగంటల బండికి వెళ్ళుదువు గానిలే. నీకు కావలసిన డబ్బు ఇస్తాను.

సీను సరేనని తలఊపాడు.

నీకు ఒకఉత్తరంఇస్తాను. అది మీనాన్నకుఇచ్చిదానికి జవాబు వ్రాయించుకొనిరా. తెలిసిందా?'

"................."

"ఉత్తరం వ్రాయించుకొని రాకపోయినా, మీనాన్న యిచ్చిన ఉత్తరం ఎక్కడైనా పారేసినా నాకు చాలా కోపం వస్తుంది?"

సీను మళ్ళీ అంగీకారాన్ని సూచిస్తూ తల ఊపాడు. "నేను చెప్పిన విషయాలన్నీ తెలిసినవా?"

"తెలిసినవి"

"ఏం చెయ్యాలె చెప్పు?" అని అడిగాను.

సీను ఏడుపుముఖంతో అన్నాడు. "మా నాన్నచేత ఉత్తరం వ్రాయించుకొని రావాలె"

"ఉత్తరం లేకపోతే?" ఈ ప్రశ్న పెద్ద గొంతుకతో హడిలిపోయేలాగున అడిగాను.

"నీకు కోపం వస్తుంది" అని జవాబుచెప్పి సీను మెల్లగా నాగదిలోనుంచి జారిపోయినాడు.

## 2

మరునాడుప్రొద్దున తొమ్మిదింటికి సీను నా గదిలోకి వచ్చి తలవంచుకు నుంచున్నాడు.

"ఏంరా? డబ్బు కావాలా?"

సీను తలఊపి అక్కరలేదన్నాడు.

"ఏం?"

"వెళ్ళను మామయ్యా"

తండ్రికి ఈ సంగతంతా తెలిసిపోతుందనీ తాను అబద్ధం ఆడినట్లు బైటపడుతుందనీ భయపడి, అసలు ప్రయాణమే మానుకొన్నాడు. వాడిని చీవాట్లు వేయటానికి అంతకంటే మంచి సమయం లేదని తోచింది.

'ఎందుకు వెళ్ళవురా?' అని అడిగాను.

సీను తల వొంచుకుని తెల్లముఖంవేశాడు. అప్పుడు నేను ఇట్లా అన్నాను 'వెధవా; నీవు ఆడుతున్న నాటకం అంతా నాకు తెలియదనుకున్నావా? వట్టి అబద్ధం. అవునా?'

'అవును.' అన్నాడు సీను భయపడిపోయి.

'వెదవ! చెడిపోతున్నావు. నీవేమీ బాగుపడే పనులు చేయటంలేదు. పచ్చి అబద్ధాలు ఆడటం నేర్చుకొన్నావు. నిజం దాగదు. ఎప్పుడో ఒకప్పుడు బైటపడుతుంది. అవునా?'

'అవును'

'ప్రాణంపోయినాసరే అబద్ధంఆడకూడదు. తెలిసిందా?

'తెలిసింది'

'హరిశ్చంద్రుడి కథ తెలుసునా?'

'తెలుసు'

'ఏం జేశాడూ?'

'అబద్ధం ఎప్పుడూ ఆడలేదు.'

'ఎన్ని కష్టాలు వచ్చినా?'

'ఓర్చుకొన్నాడు'

'అంతే కాని?'

'అబద్ధం ఆడలేదు'

'చూశావా అదీ మన ఆదర్శం. నోటివెంట అబద్ధం రాకూడదు. ఇకనుంచి ఎప్పుడూ నిజం చెపుతావా ?

'చెపుతాను.'

'ఇంకొకటి. చెడ్డపిల్లలతో సహవాసముచేయకూడదు. అట్లాంటివాళ్ళు ఏంజేస్తారో తెలుసునా? సినిమాలకూ, నాట

కాలకూ తీసికెళ్ళి మనిషిని నిమిషంలో పాడుచేస్తారు. చదువు పాడైపోతుంది. నిజమా అబద్ధమా?'

నిజమేనని సీను తలఊపాడు.

'నీవు ఇప్పటికే ఎంతో పాడైపోయినావు ! ఏం అట్లా చూస్తావు? నిజమా అబద్ధమా?'

'నిజమే'—అన్నాడు సీను.

'కాకపోతే ఇద్దరు కలిసి వెడదామను కొంటారా?' అన్నాను నేను.

'కాదు మామయ్యా'

'కాదు ఏమిటి, నీ మొఖం ! మీరు ఇద్దరూ కలిసి వెడదాం అని అనుకోలేదూ?'

సీను సిగ్గుపడి 'అనుకోలేదు' అన్నాడు.

'మరి నీవు అనలేదూ, మేమిద్దరం కలిసివెడతామని?'

అన్నాను.

'............'

'ఐతే అదికూడా అబద్ధం అన్నమాట!'

'అవును'

'ఓరి సన్యాసి. ఎన్ని అబద్ధాలు ఆడావురా! మీనాన్న నిన్ను రమ్మన్నమాట అబద్ధమే! సీతన్నా నీవూ కలిసివెడదామనుకొన్నమాట అబద్ధమే ! రెండు అబద్ధాలాడావు! ఛీ, వెధవా!'

అని చీదరించుకునేసరికి సీనుకు పాపం ఎందుకు ఇన్ని అబద్ధాలు ఆడానా అని పశ్చాత్తాపం కలిగినట్లుంది. పెద్దగా

ఏడ్చాడు పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపాలని వాడు ఎంత ప్రయత్నంచేసినా ఆగలేదు. వాడు వెక్కి వెక్కి ఏడ్వటం సాగించాడు.

'ఛాపో, వెళ్ళవా, ఇక ఎప్పుడూ అబద్ధాలాడకు' అని చెప్పి వాడిని పంపేశాను.

## 3

సీనుకు పశ్చాత్తాపం కలిగినట్లు నాకుబాగానమ్మకంకలిగింది. ఇక వాడు ఎప్పుడూఅబద్ధం చెప్పడు. ఒకకు వాడిని సన్మార్గంలోకి తిప్పగలిగానని నాకుచాలా సంతోషంకలిగింది.

కాని ఒక్కవిషయం నన్నుచాలా బాధపెట్టింది. వాడు ఇన్ని అబద్ధాలు ఎందుకు ఆడినట్లు! ఈప్రశ్నకుసమాధానం కోసం నేను చాలాసేపు ఆలోచించాను. ఇంటికి వెళ్ళాలని ఆదుర్దాపడి ఉంటాడు. అంతకుపూర్వము నాలుగురోజుల క్రితమే పదిరోజులు తల్లితండ్రులదగ్గర ఉండి వచ్చినవాడికి అంత ఆరాటం ఎందుకో వాడినే అడగాలని అనుకొన్నాను.

పదిగంటలకు సీనుగదిలోకి వెళ్ళాను. వాడుఖిన్నుడై కుర్చీలో కూర్చుని ఏదోపుస్తకంవంక చూస్తున్నాడు. నేను వెళ్ళగానే లేచి నుంచున్నాడు. వాడిమీద చెయ్యివేసిమెల్లగా వాణ్ణి నాగదిలోకి నడిపించుకొనివచ్చి, కుర్చీలో కూర్చోబెట్టి బుజ్జగించి అడిగాను.

'ఎందుకురా సీనూ అన్ని అబద్ధాలాడావు?'

సీను మాట్లాడలేదు.

'ఇంటికి వెళ్ళాలని ఉందా?'

అవునని తలఊపాడు.

'మొన్ననేగా వెళ్ళివచ్చింది? ఎందుకు ఇంతలో వెళ్లాలని బెంగపెట్టుకొన్నావు? భయంలేదు. చెప్పు!' అనిఋజ్జగించాను

వాడికి మాట పెగిలిరాలేదు. కాసేపు అయినతరువాత అన్నాడు. 'నేనువచ్చేరోజునే అనుకొంటున్నారు; మా ఆవు ఆరోజో మరునాడో ఈనుతుందని...'

ఈ మాటలు దుఃఖంతో అని, తరువాత కాస్త దుఃఖం ఆపుకొని, మళ్ళీ అన్నాడు రుద్ధకంఠంతో 'నాయనా సీనూ జున్నుతినకుండా వెడుతున్నావు! ఇంకొక్క రెండురోజులు ఉండరాదురా, పోనీ నాయనా! జున్ను నీకు పెట్టకుండా మేమందరం ఎట్లాతింటాముురా! అని మా అమ్మ ఎన్నోసార్లు అనుకొన్నది. అందుకని..., సీను ఆపైన ఒక్కమాటైనా అనలేక పెద్దగా ఏడ్చాడు.

నాకు చాలా జాలివేసింది. రెండుచొక్కాలూ, రెండు లాగులూ వాడిపెట్టెలోనుంచి తీయించి ఒక సంచిలోపెట్టుకొమని, వాడిని వెంటబెట్టుకొని బస్‌స్టాండుకు బయలుదేరాను.

సీను విషయమైయే ఆలోచిస్తూ నడుస్తున్నాను. వీణ్ణి ఇక జన్మలో అబద్ధం ఆడకుండా చెయ్యాలె. బహుశః,వాడు ఆ నిశ్చయానికే వచ్చివుంటాడని తోచింది. కాని వాడెవరో ఆసీతన్న స్నేహంలోపడ్డాడో నేనుచేసినపని అంతావ్యర్థమై పోతుంది.అందుకని ఆసీతన్నతో ఇకముందుఎప్పుడూకూడా సహవాసం చెయ్యవద్దని గట్టిగాచెప్పితే నేను ఈకుర్రవాడిని బాగుచేసినవాడిని అవుతానని అనుకొన్నాను. అందుకని అన్నాను.'ఒరే సీనూ, నీవు ఇకనుంచి బుద్ధిమంతుడివిగా ఉండాలె. ఆసీతన్న వట్టివెధవ! వీధులవెంటతిరిగేవెధవ ! వాడు

వత్తి అబద్ధాలకోరు. వాడు మీపూరువాడు అయినాసరే ఎప్పుడుగాని వాడితో మాట్లాడకు.'

'అదికాదు మామయ్యా'

'ఏదికాదురా వెధవా ! సీతన్నను నేను ఎరగనను కొన్నావా?'

ఈస్థితిలో నాకు ఒకటితోచింది.సీతన్ననునేనుఎరగను అనుకొని ఉంటాడు సీను. నిజానికి ఎరగను. అందుకనేవాడి విషయమై ఏమన్నా 'కాదు మామయ్యా' అంటున్నాడు. సీత న్నను నేను బాగా ఎరిగివున్నట్లు నటించి దబాయిస్తేనేగాని ఆవిషయమైకూడా ఉన్నసంగతి బైటపడదు. ఏడికి ఇన్ని అబద్ధాలాడాలని తోచిఉండదు. ఆవెధవే బోధించిఉంటాడు. మీమామయ్యతో ఇల్లాచెప్పిరారా అని. ఇల్లా అనుకొని నేను మళ్ళీ సీనును దబాయించాను పెద్ద గంభీరమైన గొంతుకతో.

'ఒరే సీనూ, నువ్వూసీతన్నాకలిసివెళ్ళదామనుకొన్న మాట అబద్ధమే నన్నావు. నీవు అంతవరకు నిజమే చెప్పిఉం టావు. నమ్మకమేకాని, ఒక్కఅనుమానం ఉన్నది. నిన్ను ఇల్లాగ అబద్ధాలు ఆడమనిచెప్పింది వాడే అయివుంటాడు. అవునా?'

'కాదు మామయ్యా'

నాకు చాలాఆశ్చర్యం కలిగింది. కాదంటున్నాడు!వీడికి ఈబుద్ధిపుట్టిందనినేనునమ్మలేకమరోసారిభయపెట్టాను ఇల్లాగ. 'ఆసీతన్నవిషయమై నాకుతెలియదనుకొన్నావా?నాకుఅంతా తెలుసు ! వాళ్ళమాస్టరుకూడా చెప్పాడు; సీతన్నవట్టిదుర్మా ర్గుడని వాడిసహవాసంవల్ల నీవుకూడా చెడిపోతున్నావనీ!'

సీను కళ్ళనీళ్ళు కుక్కుకుంటూ అన్నాడు.

వత్తిదే మామయ్య'

నాకు వళ్ళు మండిపోయింది 'చెంపలుపగలగొడతాను వెధవా! మేస్టరుకూడా అబద్ధం చెప్పాడంటావా?' అని గర్జించాను.

'అదికాదుమామయ్యా, అసలు, సీతన్న అంటూ ఎవరూలేరు మాఊరు కుర్రాళ్ళల్లో! ఊరికేనే నేను ఏదోపేరు అన్నాను!'

ఈమాట వినేసరికి నావళ్ళు ఝల్లుమన్నది. కాస్తతెప్ప రిల్లి 'సరేలే, అయినా ఒకటి. సీతన్నలాటివాళ్లు చాలామంది ఉంటారు. అటువంటి వాళ్ళతో సాహవాసం చెయ్యకేం!' అన్నాను.

సీను, విధేయతతో, తలవూపుతూ బస్సైకి ఎక్కాడు.

నేను క్రిందే నుంచున్నాను.

వాడు పైన...నేను క్రిందా ఉన్నాము.

'ఒరే నాయినా, వెళ్ళిరా. జున్నుతినిరా. నేనుచెప్పిన విషయం ఎప్పుడూ మరిచిపోకేం'

సీను తల ఊపాడు.

'ఏమిటి నేనుచెప్పింది?' అని అడిగాను.

'ఎప్పుడూఅబద్ధంఆడకూడదుమామయ్యా!' అన్నాడు సీను. ఆ మాటలువిని నేను 'నిజం. నిజం' అనుకొన్నాను.

బుర్రుమంటూ బస్సు వెళ్ళిపోయింది. నేనువిచారంతో వచ్చేశాను. వాడు ముందుకువెళ్ళాడు. నేనువెనక్కువచ్చాను

—0—